
కథ

# వసుధ

- బుద్ధి యజ్ఞమూర్తి



ఊళ్లో అడుగు పెట్టగానే నేను చేసే మొదటి పని లైబ్రరీకి వెళ్లడం. లైబ్రరీ అంటే నాకు ప్రాణం. మా అమ్మతో సమానం. నన్ను నేను తెలుసుకునేలా చేసింది, నన్ను మనిషిలా నిలబెట్టింది (నా నమ్మకం) అదే కదా. కానీ ఇప్పుడు లైబ్రరీకి వెళ్లడమంటే అనుకోనిది జరగడమని నాకు తెలీదు. మహా విషాదమని అంతకంటే తెలీదు. గేటు దాటగానే భువన కనిపించింది. ఆమె అసిస్టెంట్ లైబ్రేరియన్. సంతోషంగా వెళ్లి పలకరించా. ఆమెలో నన్ను చూసిన ఆనందం క్షణకాలమే. చప్పున ఆమె ముఖంలో రంగు మారింది. తను దేనికో ఆందోళన పడుతోందని అర్థమైంది.

"ఏమైంది భువనా? ఏం జరిగింది" అడిగా ఆదుర్దాగా.

"ప్రేమ్. వసు సంగతి తెలిసిందా?" అడిగింది.

"ఏమిటి? వసుకి ఏమైంది?" – నాలో ఆత్రుత.

"ఒక్కసారి వాళ్లింటికి వెళ్లిరా" – ఆమె గొంతులో వణుకు.

అయోమయంగా భువన వంక చూశా. ఏదో చెప్పాలనుకుంటోంది. కళ్లలో తడి తెలుస్తోంది. జరగరానిదేదో జరిగినట్లు మనసులో శంక.

"వసుకి ఏమైంది? ఎక్కడ వుంది? పెళ్లయి ఇంకా ఏడాది కూడా కాలేదు కదా" – గబగబా అనేశా.

"ముందు వెళ్లిరా. వచ్చాక మాట్లాడుకుందాం" అంది. ఈలోపు ఎవరో ఏదో పుస్తకం అడిగితే, ఆ పనిలో పడింది.


నాలో టెన్షన్. ఆ సంగతి నా కాళ్లకు కూడా తెలుస్తోంది. అవి ఎట్లా తీసుకుపోయాయో.. నన్ను వసు.. వసుధ ఇంటికి.

ఇంటి బయట నిశ్శబ్దం. అది నన్నింకా కలవరపెట్టింది. వాకిట్లో ఎవరూ లేరు. తలుపు దగ్గరగా మూసి వుంది. నెట్టాను. చిన్నగా చప్పుడు చేస్తూ తెరుచుకుంది తలుపు. ఆ చప్పుడుకి "ఎవరూ?" అన్న గొంతు. అది వసు వాళ్లమ్మది. నేను జవాబిచ్చే లోపునే లోపలి గదిలోంచి వచ్చింది.

"ప్రేమ్. నువ్వా? రా" అంటూనే దగ్గరకి వచ్చింది. ఆమె కళ్లలో నీళ్లు. గొంతులో బాధ. కళ్లు తుడుచుకుంటూ "అంతా దాని తలరాత. ఎవరు మాత్రం ఏం చేస్తారు?" అంటూ లోనికి దారితీసింది. ఆమె వెనకాలే నేను.

అంతే! ఒక్కక్షణం నా కాళ్లకింద భూమి కంపించినట్లయింది. నా కళ్లు పేలిపోతాయేమోననిపించింది. ఎవరు మంచం మీద? వసు.. వసుయేనా? ఏమిటి అట్లా వుంది, మంచానికి అతుక్కుపోయిన పీనుగు మాదిరిగా?

నో.. నా వల్లకాదు. వసుని అట్లా, అంత భయంకర స్థితిలో ఎట్లా చూడటం? నా ప్రియాతి ప్రియమైన నేస్తం, ఈ లోకంలో నాకు అత్యంత ప్రియతమురాలు.. వసుని ఒక ప్రాణం వున్న కళేబరంలా ఎట్లా చూడటం.. ఆ మంచంమీద ఎముకల గూడులా పడుంది వసు. వంటిమీద పిసరంత కండ కూడా లేదు. ఎముకలను కప్పుతూ తోలు వేలాడుతోంది.



"వసూ.. వసూ.. ఏమైంది నీకు? అయ్యో ఇలా అయిపోయావేం?" అంటూ తట్టుకోలేక ఆమె తల వద్ద కూలబడ్డా.

వసు నావంక అలాగే చూసింది. ఆ కళ్లు చూసేందుకే భయం గొల్పుతున్నాయి. అవి కళ్లలా లేవు. కళ్ల స్థానంలో అమర్చిన రెండు గోళీల మాదిరిగా వున్నాయి. వాటిలో ఏ భావమూ తెలీడం లేదు. గొంతు కదలుతున్నట్లే వుంది. మాట లేదు. వసు కళ్లలోంచి సన్నగా ఒక కన్నీటి చుక్కరాలి నా చేతిమీద పడింది.

"వసూ.. మాట్లాడవేం. ఏమైంది నీకు? ఈ స్థితిలో చూసేందుకా నేనిప్పుడు వచ్చింది?" అంటూ తన తలని నా చేతుల్లోకి తీసుకోబోయా.

"వద్దు ప్రేమ్. తనని కదిలించకు. తట్టుకోలేదు" చెప్పింది వసు వాళ్లమ్మ.

"ఆంటీ చెప్పండి. ఏమైంది తనకి? ఎందుకిలా వుంది?" – నా కళ్లల్లో నీళ్లు ఆగనంటున్నాయి.

"తను ఇంక ఎక్కువ రోజులు బతకదయ్యా. తనకి గొంతు కేన్సర్. చివరి స్టేజిలో వుంది. ఆపరేషన్ చేసినా వుపయోగం వుండని స్థితి కూడా దాటిపోయిందని డాక్టర్లు తేల్చేశారు. ఏమీ తినలేదు. బలవంతంగా ఏదైనా ద్రవాహారం ఇవ్వడమే. అదీ కష్టంమీద కొద్దిగానే. ఇప్పుడు తను మనుషుల్ని గుర్తు పడుతున్నది కానీ, వాళ్లతో మాట్లాడలేదు. ఎట్లా వుండేది. దానికీ గతి పట్టింది" చెప్పింది." గొంతు కేన్సరా, ఎలా? ఎంతో ఆరోగ్యంగా ఆడుతూ, హుషారుగా వుండే వసుకి అదెలా వచ్చింది?" లోపల అనుకుంటున్నట్లే పైకి అనేశా, వసు తలమీద చేయివేసి నిమురుతూ.

"తెలీదు. పెళ్లయిన ఆరు నెలలకి గొంతు నొప్పిగా వుందని చెబితే అల్లుడు హాస్పిటల్‌కి తీసుకుపోయాడు. అప్పుడేవో టాబ్లెట్లు వాడితే తగ్గిపోయింది. కానీ కొద్ది రోజులకి మళ్లీ తట్టుకోలేనంత నొప్పివస్తే డాక్టర్లు టెస్టులు చేశారు. అప్పటికే గొంతు మొత్తం పుండైపోయిందంట. కేన్సర్ ముదిరిపోయిందనీ, ఆపరేషన్ చేసినా కష్టమనీ చెప్పారు. అల్లుడు తీసుకువచ్చి ఇక్కడ వదిలివెళ్లాడు. రోజురోజుకీ తన స్థితి దిగజారిపోతోంది. కళ్లముందే నా చిట్టితల్లి పరిస్థితి చూస్తూ కూడా ఏం చేయలేని దౌర్భాగ్యురాల్ని" – ఆమె గొంతులో అంతులేని వేదన.

నా ప్రమేయం లేకుండానే ఒక్కొక్క చుక్కా నా కళ్లలోంచి బయటకు వస్తోంది. వసుకే ఎందుకిలా జరగాలి? ఎంత హుషారుగా వుండేది! ఎట్లా అల్లరి చేసేది! తనని ఎట్లా ఏడిపించేది!!

తను ఆమెని ఆట పట్టించాలని చాలాసార్లు యత్నించి ఓడిపోయాడు. కానీ ఒకే ఒక్కసారి తను ఆమెని ఏడిపించగలిగాడు. వసుకి దూరంగా వెళ్లిపోయాడు. మళ్లీ ఎన్నటికైనా వసు తనకి కనిపిస్తుందో, లేదో అనుకున్నాడు. కానీ కనిపించింది. ఇప్పుడు.. ఇలా..

ఆమె అలా అవడానికి తనే కారణమా? తను దగ్గరగా వుంటే ఆమె ఈ స్థితికి వచ్చేదా? లేదు. తను వసుని ఇట్లాంటి స్థితికి ఎన్నటికీ తీసుకు వచ్చే

వాడు కాదు.. నా ఆలోచనలు ఆగడం లేదు.

వసుని గుండెలకు హత్తుకుని 'వసూ, నిన్ను నేను బతికించుకుంటా. నా స్నేహంతో, నా ప్రేమతో బతికించుకుంటా' అనాలనుకున్నా. కానీ ఆమెని హత్తుకోలేకపోయా. ఆ మాటలూ అనలేక పోయా.

వసు కళ్లలోకి చూశా. అవి నా వంకే చూస్తు న్నాయి. అవేం చెబుతున్నాయి? తెలీడం లేదు. మాటలతోటే కాదు, కనీసం కళ్లతోనూ భావాలు పంచుకోలేని దయనీయ స్థితి. అక్కడ అట్లా తనని చూస్తూ ఎక్కువసేపు వుండటం నా చేతకాలేదు. వసుని అట్లాంటి దారుణ స్థితిలో చూసి ఓర్చుకునే శక్తి నాకు లేదు. వచ్చేశా. వచ్చేప్పుడు ఆమె కళ్లలోకి చూడలేదు నేను. నడక కూడా కష్టమైపోయింది.

ఎంతగానో ప్రేమించినవాళ్లు, అభిమానించిన వాళ్లు దూరమైనప్పుడు ఆ బాధ కొద్దిసేపే వుంటుం దనీ, ఆ తర్వాత ఎవరి జీవితంలోకి వాళ్లు వెళ్లిపోతా రనీ, కాలం గడిచేకొద్దీ వాళ్ల జ్ఞాపకాలు కూడా మనని బాధించవనీ మానసిక నిపుణులు చెబుతుం టారు. కానీ నా వరకు నాకు వసు విషయంలో అది నిజం కాలేదు. వసుని కోల్పోయినందుకు, వసుని దూరం చేసుకున్నందుకు నేను ఇప్పటికీ.. ఎంత వేదనని అనుభవిస్తున్నానో నాకు మాత్రమే తెలుసు. తన జ్ఞాపకాలు ఈ ఆరేళ్లలో నన్ను నిరం తరం అంటిపెట్టుకునే వున్నాయనీ, ఒక యంత్రంగా మాత్రమే నేను నా వుద్యోగాన్ని చేస్తు న్నాననీ నాకు మాత్రమే తెలుసు.

***

డిగ్రీ పూర్తయిన కొద్ది నెలలకే రెవెన్యూ డిపార్ట్ మెంట్లో క్లర్కుగా జాయినయ్యా. మచిలీపట్నంలో వుద్యోగం. ఒకరోజు బంధువుల పెళ్లికని మా ఊరొచ్చా. అలవాటు ప్రకారం లైబ్రరీకి వెళ్లి శ్రీశ్రీ మిత్రుడు కొంపెల్ల జనార్దనరావు ప్రచురించిన 'ఉద యిని' సంచికలు తిరగేస్తున్నా.

ఎవరో 'ప్రేమ్' అని పిలిచినట్లయి, ఉలికిపా టుగా చూశా.

ఎదురుగా వసుధ. ''వసుధా.. నువ్వేనా!'' అని ఆశ్చర్యపడ్డా.

''నేనే. ఏం. ఏమన్నా మారానా?'' – తనలో అదే అల్లరి, హుషారు.

''లేదు.. అప్పట్లానే బక్కగా వున్నావు'' – నవ్వా. తనూ జత కలిపింది.

దాదాపు నాలుగేళ్లయిపోయింది మేం విడి పోయి. ఇంటర్మీడియేట్ అయ్యాక నేను గుంటూరు లోని మా మావయ్య వాళ్లింట్లో వుంటూ బీయస్సీ చదివా. మధ్యలో ఎన్నిసార్లు వూరొచ్చినా వసుధ ఎప్పుడూ తారసపడలేదు. తను కనిపించడం ఇప్పుడే. చాలాకాలం తర్వాత కలుసుకోవడం వల్ల మా కళ్లు మాట్లాడుకున్నాయి కొద్ది క్షణాలు. హృద యాలు కూడా మాట్లాడుకునే వుంటాయి.

ఇంటర్‌లో ఇద్దరం ఎంత సన్నిహితంగా గడిపాం! తనవి ముత్యాల్లాంటి అక్షరాలు. అందుకే అవసరం వున్నా, లేకపోయినా తరచూ తన నోట్సులు తీసుకునేవాణ్ణి. ఆమె అక్షరాల్ని తడిమి సంతోషపడేవాణ్ణి.

వసుధ అందగత్తె... అంటే చెప్పలేమ. పదహారే ళ్లున్నా, అంతకంటే చిన్నదిగా కనిపించేది. నా ఫ్రెండ్సయితే ''ఆ బక్క వసుధ దగ్గర ఏముందిరా. దాని చుట్టూ తిరుగుతావు'' అని వేళాకోళం చేసే వాళ్లు. అప్పుడు నాకు రోషం, ఉక్రోషం.. రెండూ వచ్చేవి. అయినా పళ్లు బిగించి, మౌనంగా వుండి పోయేవాణ్ణి. కానీ వసు స్నేహాన్ని మాత్రం నేను వదులుకోలేదు.

వసు కూడా నాతో చాలా చనువుగా వుండేది. నేను కనిపిస్తే తన కళ్లలోని మెరుపు దాగేదికాదు. అందుకే తనంటే నాకు చాలా ఇష్టం. అది ఉత్త స్నేహం కాదనీ, మా మధ్య ఇంకేదో భావం పెన వేసుకుంటున్నదనీ తెలీని వయసు కాదు. అప్పటికే ఎన్ని సినిమాలు చూడలేదు, ఎన్ని నవలలు చదవ లేదు!

కానీ.. చిత్రం! నేను కానీ, తను కానీ.. మా మన సుల్లోని భావాల్ని బయట పెట్టలేదు. పైకి మేం స్నేహం చేస్తుంటే, మా మనసులు మాత్రం ప్రేమ భాష మాట్లాడుకునేవి. ఆ సంగతి మా ఇద్దరికీ తెలుసు.

ఇంటర్మీడియేట్ చివరి ఎగ్జామ్ రోజు.. ఇప్పటికీ కళ్లముందు మెదులుతోంది. ఎగ్జామ్ రాసేసి రూమ్ లోంచి బయటకొచ్చా. వసుది పక్క రూమ్. చూస్తే.. తను కనుపించలేదు. 'వెళ్లిపోయిందా' అనుకుంటూ ఇవతలకి వచ్చా. నేరేడు చెట్టు కింద నిల్చొని, నా వంకే చూస్తోంది.

''వసూ. ఎలా రాశావ్ ఎగ్జామ్'' అంటూ దగ్గ రకు వెళ్లా. వసు కొత్తగా కనిపించింది. ఆమె కళ్లలో తడి! వాటిని బయటకు రానీయకూడదని విశ్వప్ర యత్నం చేస్తూ ''బానే రాశా'' అంది.

ఆమె కళ్లు ఏం చెబుతున్నాయో అర్థమైంది నాకు. ''ఏయ్ ఏంటిది. ఏడుస్తున్నావా?'' అన్నా.

అప్పుడు వోణీ చెంగుతో కళ్లు తుడుచుకుంది. నవ్వే యత్నం చేసింది. నేరేడు చెట్టు మొదలు వెడ ల్పుగా వుంటాన మేం ఎవరికీ కనిపించం.

''మనం మళ్లీ ఇప్పట్లో కలవలేముగా'' అంది.

'ఏం?'

''రేపట్నుంచీ కాలేజీ వుండదుగా''

మౌనం వహించా. కొద్ది రోజులపాటు తను కని పించదనే సత్యం మనసును కలవరపెట్టింది. వెంటనే నా నోటినుంచి మాట రాలేదు.

''నిన్ను మిస్సవుతానేమోననే భయం కలుగు తోంది'' అంది తనే.

చప్పున తన ముఖం వంక చూశా. వసు ఎందు కలా అంది? ''సెలవుల తర్వాత మళ్లీ డిగ్రీలో కలు సుకుంటాం కదా'' అన్నా.


''ఏమో. కానీ అప్పటిదాకా నిన్ను చూడకుండా వుండలేననిపిస్తోంది'' – చివరలో వసు గొంతు పూడుకుపోయింది.

అలాంటి మాటలు నాతో మాట్లాడటం అదే తొలిసారి తనకు. ఆ మాటల్లో నా పట్ల అంతులేని ప్రేమ తెలుస్తోంది. అమితమైన అనురాగం కనిపి స్తోంది.

కానీ నేనేమన్నాను? ''వసూ అలా అనకు. అలా అధైర్యపడితే ఎలా?''. నానుంచి 'నేను కూడా నిన్ను చూడకుండా వుండలేను' అనే జవాబును ఆశించినట్లు, నిమిషం సేపు మౌనంగా వుండిపో యింది.

''ప్రేమ్ నీ పెన్నిస్తావా గుర్తుగా'' అడిగింది, ఆ తర్వాత.

ఇచ్చాను. పెన్ను తీసుకుంటూ నా చేతిని తన చెంపకానించుకుంది. నేను తత్తరపాటుగా అటూ



ఇటూ చూశా, ఎవరైనా చూస్తున్నారేమోనని. అప్పుడే తెలిసింది నాకు, నేనెంత పిరికివాణ్ణో.

***

మనం ఊహించనివే ఎక్కువగా జరుగుతుంటాయి. నాన్న ''ఇంక నిన్ను చదివించడం నా వల్ల కాదురా. ఏదైనా వుద్యోగం చూసుకో'' అన్నాడు. నిజమే. ఇంట్లో పరిస్థితి ఏమంత బాగోలేదు. వరుసగా రెండేళ్ళ పత్తిపంట చేతికి అందలేదు. ఒకసారి కరువు వల్ల ఎండిపోతే, ఇంకో ఏడాది తెగులుపట్టి చెడిపోయింది. నాన్న అప్పులపాలయ్యాడు. తెలిసి తెలిసీ నాన్నని చదివించమని ఎలా అడగను?

కానీ కనీసం బీయస్సీ అయినా చదవాలనేది నా తపన. నా బాధను అర్థం చేసుకుంది అమ్మ. విషయం చెబుతూ గుంటూరులోని మా మేనమామకు ఉత్తరం రాసింది.

''ఏం పర్వాలేదు. ప్రేమ్‌ని పంపించండి. వాడి చదువు సంగతి నేను చూసుకుంటా. మీరేమీ దిగులుపడొద్దు'' అని సమాధానం వచ్చింది మావయ్య నుంచి.

అట్లా గుంటూరులో మావయ్య వాళ్లింట్లో వుండి బీయస్సీ చదివా. మావయ్యకు పాతికెకరాల మిరప చేను వుంది. బాగా సంపాదించాడు. మేమంటే అభిమానం. అక్కడ నాకేలోటూ కలగలేదు.

వసు మా వూళ్లోనే బీకామ్ పూర్తిచేసింది. డిగ్రీ చదివే రోజుల్లో సెలవులకి ఇంటికెళ్లినప్పుడల్లా వసుని కలవాలని మనసు ఎంతగా ఆరాటపడేదో. మా ఫ్రెండ్స్ ద్వారా తన సంగతులు తెలుస్తుండేవి. ఫస్టియర్‌లో వుండగానే వాళ్ల నాన్న చనిపోయినట్లు విన్నప్పుడు ఎందుకో మనసులో బాధ మెదిలింది.

ఒక ఆదివారం మార్కెట్‌కి వెళ్లి కూరగాయలు తీసుకుని వస్తుంటే, అదుపుతప్పిన ఓ కాడెద్దు ఆయన్ని వెనుకనుంచి కుమ్మేసిందంట. దాని కొమ్మొకటి ఆయన వీపులో లోతుగా దిగబడి, అక్కడే కుప్పకూలిపోయాడంట. అయినా వదలకుండా ఆ ఎద్దు ఆయన్ను కాళ్లతో తొక్కేసిందంట. జనం పోగయ్యి, దాన్ని తరిమేసేటప్పటికే ఆయన ప్రాణాలు పోయాయంట. ఎంత భయంకరమైన చావు! వింటేనే వొణుకు పుడుతుంది. అట్లాంటిది ఆయన ఆ సమయంలో ఎంత నరకాన్ని అనుభవించి వుంటాడో..

కుటుంబానికి ఆధారమైన ఆయన పోవడంతో వసు కుటుంబం కోలుకోవడానికి కాస్త టైమ్ పట్టింది. ఆయన హెడ్ కానిస్టేబుల్ కావటాన వచ్చిన గ్రాడ్యుటీతో, వస్తున్న పెన్షన్‌తో ఆ కుటుంబం నెట్టుకొస్తోంది. వసుకి ఓ చెల్లెలు కూడా. ఇద్దరు కూతుళ్లని చదివిస్తూ వసు వాళ్లమ్మ బట్టలు కుడుతోంది.

బీయస్సీ అయిపోయింది. రెవెన్యూ డిపార్ట్‌మెంట్‌లో జాయినయ్యా. ఎమ్మెస్సీ చేయాలని వున్నా, అమ్మానాన్నలకు ఆలంబన కావాలనే వుద్దేశంతో చదువుకు అంతటితో స్వస్తి చెప్పేశా.

***

## ప్రియాంక, హర్మన్‌బవేజా జంటగా కామెడీ చిత్రం



బాలీవుడ్ కామెడీ చిత్రాల్లోకి అశుతోష్ గోవర్కర్ తాజా చిత్రం 'వాట్స్ యువర్ రాశి?' వచ్చి చేరనుంది. ప్రియాంక చోప్రా, హర్మన్ బవేజా జోడీగా నిర్మితమవుతున్న ఈ చిత్రం త్వరలో షూటింగ్ పూర్తి చేసుకొని ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. ఈ సందర్భంగా అశుతోష్ గోవర్కర్ మాట్లాడుతూ, తనకు రొమాంటిక్ సినిమాలతో పాటు కామెడీ చిత్రాలంటే చాలా ఇష్టమనీ, పూర్తి స్థాయిలో కామెడీ చిత్రాన్ని నిర్మించాలని ఎప్పటి నుంచో అనుకుంటున్నట్లు చెప్పారు. 'చుప్ కే చుప్ కే' లాంటి కామెడీ రొమాన్స్ చిత్రాలతో పాటు హృషికేష్ ముఖర్జీ నిర్మించిన చిత్రాలంటే కూడా ఇష్టమని తెలిపారు. జావీద్ అక్తర్ పాటలు సమకూరుస్తున్న ఈ చిత్రానికి నితిన్ దేశాయ్ తదితరులు సాంకేతిక సహకారాన్ని అందిస్తున్నారు.

విడిపోయిన నాలుగేళ్లకు నన్నూ, వసునీ కలిపిన లైబ్రరీకి థాంక్స్. ఆ రోజు నుంచీ మా స్నేహం మళ్లీ మొదలు. రెండు వారాలకోసారి మా వూరొస్తున్నా, మచిలీపట్నం నుంచి. వసు లైబ్రరీలో పని చేస్తుండటం వల్ల మేం కలుసుకోవడం సాధ్యపడుతోంది. నేను వచ్చినప్పుడల్లా వసుతో పాటు అక్కడ పనిచేసే భువన మా ఇద్దరికీ ఏకాంతం కల్పిస్తోంది. కానీ అక్కడ ఎక్కువసేపు మాట్లాడుకునే సౌలభ్యం లేదు.

ఒకసారి వాళ్లింటికి తీసుకుపోయింది వసు. ఆ ఇంటికి వెళ్లడం అదే తొలిసారి. వాళ్లమ్మ నన్ను బాగా రిసీవ్ చేసుకుంది. ''నువ్వేనా ప్రేమ్ అంటే. నీ గురించి వసు చాలాసార్లు చెప్పింది బాబూ. చదువుకునేప్పుడు ఒక్కసారి కూడా నువ్వు మా ఇంటికి రాలేదేం'' అడిగింది ఆమె.

మరి నేను? ఎన్నడూ మా ఇంట్లో వసు ప్రస్తావన తీసుకురాలేదు నేను. సిగ్గుపడ్డా.. వసుకీ, నాకూ వున్న తేడా తెలిసి. అందుకే తనని మా ఇంటికి రమ్మని అడిగా.

''నేను మీ ఇంటికి వస్తే నీకేమీ ఇబ్బంది కలగదా'' అంది నా కళ్లలోకి ఆరాగా చూస్తూ.

''ఎందుకు ఇబ్బంది?'' అంటుంటే నాలోని తడబాటు నాకే తెలుస్తోంది.

''మీ ఇళ్లల్లో వాళ్లు ఆచారాలు బాగా పాటిస్తుంటారని మన ఫ్రెండ్స్ అంటుంటారు. నేనొస్తే మీవాళ్లు ఎలా రియాక్ట్ అవుతారో'' – మొహమాటం లేకుండా అనేసింది.

ఉక్రోషాన్ని అదుముకుంటూ ''ఆ.. అదేం లేదు వసూ.. అమ్మానాన్నలకి నేనంటే చాలా ప్రేమ. వాళ్లేమీ అనుకోరు'' అన్నా.

ఒక ఆదివారం సాయంత్రం లైబ్రరీ నుంచి నాతో పాటు మా ఇంటికి వచ్చింది వసు. మేమిద్దరం పక్క పక్కనే నడుస్తూ వస్తుంటే మా వీధిలోని వాళ్లంతా మా వంక వింతగా, ఆశ్చర్యంగా కళ్లు విప్పార్చి చూడడం మా దృష్టిని దాటిపోలేదు. నా సరసన వాళ్లకి తెలీని ఎవరో అమ్మాయి కనిపించడమే వాళ్ల ఆశ్చర్యానికి కారణం.

వసుని పరిచయం చేసే నిమిషంలో అమ్మ కళ్లలో ఒకింత ఆశ్చర్యం, ఒకింత తిరస్కార భావం కనిపించి ఇబ్బంది పడ్డా. పైకి నవ్వుతూ వసు వివరాలు అడిగి తెలుసుకుంటున్నప్పటికీ వసు రాక ఆమెకి ఇష్టంలేదనే సంగతి ఆమె ముఖం చెప్పేస్తోంది.

ఓ పది నిమిషాలు భారంగా గడిచాయి. ఎవరి వద్దా మాటలు లేవు. 'వస్తాను ఆంటీ'' అని లేచింది వసు. 'అప్పుడేనా.. కాసేపు వుండి వెళ్లమ్మా' అని అమ్మ అంటుందని ఆశించా.

''మంచిదమ్మా'' ముక్తసరిగా అని వూరుకుంది అమ్మ. నా మనసు చివుక్కుమంది.

వసుకి తోడుగా రోడ్డుదాకా వచ్చా. అంతదాకా మా మధ్యకూడా మాటలు లేవు. ''ఇక నే వెళ్తాలే ప్రేమ్'' అంది, నా వంక చూస్తూ.

''సారీ వసూ'' అన్నా. ఎందుకన్నానో ఆమెకి తెలుసు.

''ఇలాంటి అనుభవం ఎదురవుతుందని నేను ఊహించా ప్రేమ్. నీకూ తెలిసింది కదా'' అంటుంటే వసు గొంతు చిన్నగా వొణికింది.

ఆ తర్వాత నేను తరచూ వాళ్లింటికి వెళ్లడమే కానీ మళ్లీ తనెప్పుడూ మా ఇంటికి రాలేదు.

***

''ప్రేమ్. అమ్మ పెళ్లి సంబంధాలు చూస్తానంటోంది'' – ఒకరోజు చెప్పింది వసు.

''నిజంగానా. చాలా సంతోషం. పాతికేళ్లొచ్చాయి కదా. ఇప్పటికే ఆలస్యమైంది. సరేనన్నావా?'' అన్నా, నా కలవాటు లేని రీతిలో నాటకీయంగా.

''సరేనన్నా'' అంది తనదైన అల్లరి ధోరణితో.

''అవునా. అయితే తొందరలో పెళ్లికూతురు

కాబోతున్నావన్న మాట'' – నేనూ తగ్గలేదు.

''ఏమో. అవతలి వాళ్లకి నేను నచ్చాలి కదా''

''నీకేం. ఇదివరకైతే బక్కగా వుండే దానివి కానీ, ఇప్పుడు చక్కగా వున్నావు కదా''

''మరైతే అమ్మకేం చెప్పమంటావ్?''

''నన్నడుగుతావేం?''

''నీ మీదే కదా అది ఆధారపడి వుంది''

ఠక్కున గొంతుకి ఏదో అడ్డుపడినట్లయింది. బంతిని నా కోర్టులోకి వేసింది వసు. ఏం చెప్పను? అమ్మ మాటలు జ్ఞప్తికొచ్చాయి. ''అనితకి పెళ్లి చేయాలని మావయ్య తొందర పడుతున్నాడు. 'నేను బావనే చేసుకుంటా' నని అనిత పట్టుబడుతున్నదంట. ఇప్పుడు తను వున్న స్థాయిలో మావయ్య ఏ గొప్పింటి సంబంధాన్నో కలుపుకునేవాడే. కానీ మనతో సంబంధానికి సరేనన్నాడు. ఏ సంగతీ చెప్పమని కబురు చేశాడు. ఏం చెప్ప మంటావ్?''

తను అన్నాడు ''ఇప్పుడే నాకు పెళ్లేమి టమ్మా. ఇంకో రెండేళ్లు పోయాక చూసుకో వచ్చు''.

''సరే మావయ్యకి చెప్పిచూస్తా. కానీ ఆయన ఎప్పుడంటే అప్పుడే మీ పెళ్లి. నువ్వు మాత్రం ఈలోగా ఏ అమ్మాయినో తీసుకొచ్చి 'ఈమె నీ కోడలు' అంటే కుదరదు. నీ ఆడ స్నేహితుల మీద నాకు నమ్మకం లేదు'' అంది అమ్మ కాస్త కటువుగానే.

తను విలవిల్లాడిపోయాడు. వసుని తను ప్రేమిస్తున్న సంగతి చెప్పాలనుకున్నాడు.. కానీ గుండెలోని మాట గొంతుదాటి రాలేకపోయింది. పిరికితనం తనని కట్టేసింది. పైగా ఆ మాటలతో అమ్మ తన నోరు నొక్కేసింది.

మావయ్య కూతురు అనిత కళ్ల ముందు మెదిలింది. ఆమె మీద తనకు అయిష్టత లేదు. అట్లా అని ప్రేమా లేదు. వాళ్లింట్లో వున్నన్ని రోజులూ తన పనులన్నీ చేసిపెట్టేది. ''బావా.. బావా' అని వెంట తిరిగేది. తనంటే అభిమానం చూపించేది. మరదలనే భావనతో చనువుగా వుండటం తప్ప అనిత పట్ల తనకెప్పుడూ ఎలాంటి కోరికా కలగలేదు.

ఇప్పుడు వసుకి ఏం సమాధానం చెప్పాలి?

''వసూ.. నువ్వంటే నాకు చాలా ఇష్టం. ప్రేమ. కానీ జీవిత వాస్తవం వేరు. అది మనల్ని ఒకటి చేయలేదు'' అన్నా. అప్పుడు వసు నా వంక చూసిన చూపు జ్ఞాపకం వచ్చినప్పుడల్లా వొళ్లు జలదరిస్తుంటుంది. ఆ చూపులో నా పట్ల కనిపించింది తిరస్కారమా? అసహ్యమా? ఈసడింపా? లేక జాలా?

నాలోని అసలు మనిషిని బట్టలూడదీసి నాకు చూపిస్తూ.ఎంతసేపు చేష్టలుడిగిపోయి అట్లాగే వున్నానో. నా నిజస్వరూపం నాకే నగ్నంగా, అసహ్యంగా దర్శనమిచ్చింది. అవును.. నేను పురుగుకంటే హీనం. ఒంటిమీద ఆదర్శాల తోలు కప్పుకుని, లోపల కట్టుబాట్లని ఎదిరించలేని రెండో ముఖాన్ని దాచి పెట్టుకున్న గొంగళిపురుగుని. వసు మాటలు నా గుండెల మీద పడ్డాయి, సమ్మెట దెబ్బల్లా. వసు మాటలు.. నిజాల నిప్పులు..

''నువ్వు చాలా పుస్తకాలు చదువుకున్నావ్ కదూ ప్రేమ్. అందుకే జీవిత వాస్తవమంటూ పెద్ద పెద్ద మాటలు చెబుతున్నావ్. నీలాంటి వాళ్లంతా ఇంతే. పైకే ఆదర్శాలు. చేతల్లో చూపించని ఆదర్శాలని మాటల్లోనైనా ఇంకెప్పుడూ చూపించకు. ప్లీజ్.. ఆదర్శవంతుడిగా నటించకు'' – వెళ్లిపోయింది.. నాలోని అసలు మనిషిని బట్టలూడదీసి నాకు చూపిస్తూ. ఎంతసేపు చేష్టలుడిగిపోయి అట్లాగే వున్నానో. నా నిజస్వరూపం నాకే నగ్నంగా, అసహ్యంగా దర్శనమిచ్చింది. అవును.. నేను పురుగుకంటే హీనం. ఒంటిమీద ఆదర్శాల తోలు కప్పుకుని, లోపల కట్టుబాట్లని ఎదిరించలేని రెండో ముఖాన్ని దాచిపెట్టుకున్న గొంగళిపురుగుని. వసు మాటలు నా గుండెల మీద పడ్డాయి, సమ్మెట దెబ్బల్లా. వసు మాటలు.. నిజాల నిప్పులు..

***

వసు పెళ్లయిపోయింది. మద్రాసు సంబంధం. అతనేదో ఆఫీసులో చిన్నపాటి ఉద్యోగం చేస్తున్నట్టు చూచాయిగా తెలిసింది. ఇన్నాళ్లకి.. ఇప్పుడు వసుని ఇంత ఘోర స్థితిలో చూశా. కలలో కూడా ఊహించని దారుణ స్థితిలో చూశా.ఊళ్లో ఉండబుద్ధి కాలేదు. మళ్లీ రమ్మనమన్న భువన వద్దకు వెళ్లలేదు. మచిలీపట్నంకి రైల్లో వెళుతూ, కిటికీ పక్కనే కూర్చుంటే.. కళ్లల్లోంచి నీళ్లు ఆగకుండా ఉబుకుతూనే వున్నాయి. ఎదురుగా కూర్చున్నవాళ్లు ఆశ్చర్యంగా చూస్తున్నా గమనించనట్లే వుండిపోయా. నాలో రగులుతున్న అగ్ని గురించి వాళ్లకి ఏం తెలుస్తుంది?

***

వసు ఏమైంది? చనిపోయిందా? ఆ స్థితిలో, ఏ క్షణంలోనైనా ఊపిరి ఆగిపోతుందన్నట్లు వున్న తను బతికి వుంటుందా? ఏమో.. నాకు తెలీదు.. తెలుసుకోవడానికి నేను యత్నించలేదు. నిజం. మీరు నమ్మాలి. 'వసు చచ్చిపోయింది' అన్న వాస్తవాన్ని విని తట్టుకునే శక్తి నాకు లేదు. ఆ తర్వాత ఇంకెప్పుడూ నేను లైబ్రరీ వీధి వైపు వెళ్లలేదు. అసలు ఊరికి వెళ్లడమే బాగా తగ్గించేశా. నా ఫ్రెండ్స్ వద్ద కూడా వసు ప్రస్తావనని ఎప్పుడూ తీసుకురాలేదు. కానీ...ఆ రోజు..ఆఫీసుకని బయల్దేరుతున్నా. ఇప్పుడు నేను హెడ్ క్లర్కుని. ''అనితా నేను రెడీ. ఇంకెంతసేపు?'' అన్నా, బైక్ మీద కూర్చుని, గుమ్మం వంక చూస్తూ. ''అయిపోయింది బావా'' అని ఆగి.. ''వసూ! నాన్న నీ కోసం వెయిట్ చేస్తున్నారు. ఈ రోజన్నా స్కూలుకి కాస్త ముందుగా వెళ్లు'' అంది అనిత. ''నేను రెడీ నాన్నా'' అంటూ పరుగెత్తుకొచ్చింది ఐదేళ్ల నా ముద్దుల పట్టి వసు.. వసుధ!

✻



## షారూఖ్ సొంత డబ్బా....

బాలీవుడ్ కింగ్ షారూఖ్ ఖాన్ ఎప్పుడు ప్రెస్‌మీట్ పెట్టినా తన చిత్రాల గురించీ, రాబోయే తన ప్రాజెక్టుల గురించీ ఎక్కువగా చెపుతుంటాడు. ఇందుకు భిన్నంగా ఇటీవల ఓ విలేఖరుల సమావేశం ఏర్పాటు చేసి, తన కుటుంబం గురించీ, భార్య గురించి, పిల్లల గురించీ చెప్పి అందరినీ ఆశ్చర్యంలో ముంచెత్తాడు. తన జీవితంలో భార్య గౌరి ప్రవేశం, ఆ తరువాత ఇద్దరు పిల్లల ఆగమనం తదితర వివరాలు చెప్పుకొచ్చాడు. నేను, గౌరి గత 24 సంవత్సరాలుగా ఒకరికొకరు తెలుసు అంటే దాదాపు పావు సెంచరీ పూర్తయింది. మా మ్యారేజీ 1991లో జరిగింది. అంటే సరిగ్గా 17 సంవత్సరాల క్రితం నాకు, గౌరీకి వివాహం జరిగింది. నా జీవితంలో పెళ్లి అపురూపం కాకపోయినా, పిల్లలు మా మధ్యకు రావడం నిజంగా అపురూపమే. ఆర్యన్ గౌరిలాగా వుంటే, సుహానా నాలాగా ఉంటుంది. గౌరీ, నేనూ అంతగా తెలివిగల వాళ్లం కాదు. ఇప్పటి వరకూ ఇద్దరమూ ఎలాంటి ప్లాన్ చేయలేదు. పిల్లల విషయంలో మాత్రం మాకు పెద్ద పెద్ద ఆశలు,కోరికలు ఉన్నాయి. వాటిని నిజం చేసుకోవడానికి కృషి చేస్తున్నాం.